క్లుప్తంగా

పంచాయతీగా ఏర్పాటు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

గోపాలపురం: మండలంలోని వేళ్లచింతలగూడెం పంచాయతీ పరిధిలో ఉన్న పెద్దాపురం గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలంటూ గురువారం గ్రామస్తులు తహసీల్దార్ కె.అజయ్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన పెద్దాపురం గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సంబంధిత అధికారులకు, నాయకులకు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని వినతి పత్రాలు అంజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొర్లపాటి అన్నవరం, గన్నిన రామారాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సొసైటీ భవన నిర్మాణానికి కృషి

నిడదవోలు రూరల్: సొసైటీ అభివృద్ధితో పాటు నూతన భవన నిర్మాణానికి కృషిచేస్తానని పీఏసీఎస్ చైర్మన్ ఉప్పులూరి రామ్మోహన్‌రావు అన్నారు. మండలంలోని సమిశ్రగూడెం సొసైటీ కార్యాలయంలో పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా ఉప్పులూరి రామ్మోహన్‌రావు, సభ్యులుగా పెనికే వెంకట్రావులు గురువారం ప్రమాణస్వీకారం చేశారు. సర్పంచ్ దేశాబత్తుల జ్యోత్స్న ప్రియాంక, మాజీ సొసైటీ అధ్యక్షుడు గజ్జరపు శ్రీరమేష్, మాజీ సర్పంచ్ ఎండీ అక్రం, నాయకులు పోలిరెడ్డి వెంకటరత్నంలు నూతన కార్యవర్గాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి కలగర మంజుశ్రీ, నాయకులు మద్దుకూరి శ్రీను, కస్తూరి సాగర్, కొత్తపల్లి సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

మండల కన్వీనర్‌కు తలారి పరామర్శ



నాగేశ్వరావును పరామర్శిస్తున్న తలారి వెంకట్రావు

తాళ్లపూడి: మండలంలోని రావూరుపాడుకు చెందిన వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కొలిశెట్టి నాగేశ్వరావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఈ మేరకు ఆయన కాలుకు గాయమవ్వగా చికిత్స అనంతరం విశ్రాంతి తిసుకుంటున్నారు. సమాచారం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు గురువారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య సమాచారం అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్దేవం గ్రామ కమిటీ అధ్యక్షుడు బట్టు సుబ్బారావు, నాయకులు కొయ్య దుర్గారావు తదితరులున్నారు.

మాస్టార్‌కి బుక్కు రిబిక్కిరి!



- జవాబులు రాసేందుకు అసెస్మెంట్ బుక్‌లెట్ల పంపిణీ
- పాఠశాలల్లో మూల్యాంకనానికి సమయం సరిపోదంటున్న టీచర్లు
- ఇప్పటికే బోధనేతర పనులతో సతమతమవుతున్నామని ఆవేదన



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

సాక్షి, అమలాపురం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను అంచనా వేసేందుకు విద్యా సంవత్సరంలో ప్రతి ఏటా పరీక్షలు నిర్వహిస్తారు. నాలుగు సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలు, రెండు సమ్మేటివ్ పరీక్షలను నిర్వహించడం పరిపాటిగా వస్తోంది. అందులో భాగంగా ప్రస్తుత విద్యా సంవత్సరంలో సెల్ఫ్ అసెస్‌మెంట్-1 పరీక్షలు ఈ నెల 11 నుంచి ప్రారంభమయ్యాయి. అయితే విద్యార్థులకు నిర్వహిస్తున్న పరీక్షలకు సంబంధించిన మూల్యాంకనం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. పరీక్షల్లో ప్రశ్నలకు జవాబులు రాసేందుకు వైట్ పేపర్ల స్థానంలో అసెస్మెంట్ బుక్‌లెట్లు ఇవ్వడాన్ని ఉపాధ్యాయులు వ్యతిరేకిస్తున్నారు. ఇప్పటికే విద్యాశాఖ అమలు చేస్తున్న బోధనేతర పనులతో సతమతమవుతున్నామని ఒక పక్క ఆందోళన చేస్తుంటే..మరింత భారంగా అసెస్‌మెంట్ బుక్‌లెట్ విధానం ఉందని ఉపాధ్యాయులు ఆవేదన చెందుతున్నారు. ఉపాధ్యాయులపై పనిభారం పెంచేందుకు మాత్రమే ఈ విధానాన్ని తీసుకొచ్చారని ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. జిల్లాలో సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలు 13వ తేదీతో ముగుస్తాయి. జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పరిధిలో 1,561 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 89,625 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు.

ఒక్కో సబ్జెక్టుకు ఒక్కో బుక్‌లెట్

విద్యార్థులకు నిర్వహించే పరీక్షలకు సంబంధించి విద్యాశాఖ ద్వారా సరఫరా చేసిన అసెస్‌మెంట్ బుక్‌లెట్లపై ఉపాధ్యాయుల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రతి తరగతిలో ఒక్కో సబ్జెక్టుకు ఒక్కో అసెస్‌మెంట్ బుక్‌లెట్‌ను అందజేశారు. ఒకటి నుంచి 10వ తరగతి వరకు ఈ విధంగా ప్రతి తరగతి విద్యార్థికి అందజేశారు. 1వ తరగతి విద్యార్థికి నాలుగు అసెస్‌మెంట్ బుక్స్ ఉంటే, 10వ తరగతి విద్యార్థికి ఏడు బుక్‌లెట్లు అందజేశారు. ఒక్కో టీచర్ వారు బోధించే తరగతులు, సబ్జెక్టుల వారీగా అసెస్‌మెంట్ బుక్‌లెట్స్‌లో విద్యార్థులు రాసిన జవాబులను మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది. విద్యాశాఖ ఉన్నతాధికారులు ఇస్తున్న పనులను చేసేందుకు అధిక సమయం వెచ్చించాల్సి వస్తున్న నేపథ్యంలో అసెస్‌మెంట్ బుక్‌లెట్లలో జవాబులు రాయించడం, మూల్యాంకనం చేయడం ఒక పెద్ద ప్రహసనంగా ఉందనేది ఉపాధ్యాయుల వాదన. విద్యార్థులు రాసిన జవాబులను మూల్యాంకనం చేసి, బుక్‌లెట్‌లో ఇచ్చిన ఓఎంఆర్ షీట్‌లో మార్కులు వేయడంతోపాటు వారు రాసిన పేజీలను స్కాన్ చేసి విద్యాశాఖ ఇచ్చిన లీప్ యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఆ విధంగా అప్‌లోడ్ చేసే సందర్భంలో సర్వర్ బిజీగా ఉన్నా, నెట్‌వర్క్ లేకున్నా, నెట్‌వర్క్ నెమ్మదిగా ఉన్నా అప్‌లోడ్ ప్రక్రియలో తీవ్రమైన జాప్యం చోటు చేసుకుంటుంది.

అంత వీజీ కాదు

గతంలో విద్యార్థి రాసిన పరీక్ష పేపర్లను ఉపాధ్యాయులు వారి వెసులుబాటును బట్టి పాఠశాలలో లేదా పేపర్ కట్టలను ఇంటికి తీసుకువెళ్లి మూల్యాంకనం చేసేవారు. ఇప్పుడు బుక్‌లెట్లను ఇంటికి తీసుకుని వెళ్లాలంటే అంత వీజీ కాదని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుక్‌లెట్ల బండిల్స్‌ను మోటార్ సైకిల్‌పై తీసుకుని వెళ్లడం సాధ్యం కాదని అంటున్నారు. తప్పనిసరిగా బడిలోనే దిద్ది ప్రతి సబ్జెక్టుకు సంబంధించి విద్యార్థులు రాసిన జవాబు పత్రాలను స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాలి. ఒక్కొక్క విద్యార్థి మూడు పేజీలు రాస్తే వంద నుంచి 120 పేజీలను ఒక సబ్జెక్టుకు స్కాన్ చేయాల్సి ఉంటుంది. ఉన్నత పాఠశాలలో ఒక సబ్జెక్టు టీచర్ నాలుగు తరగతులకు వెళ్తుంటే ఆ ఉపాధ్యాయుడికి ఆ పని పూర్తి చేయడానికి కనీసం వారం నుంచి పది రోజుల సమయం పడుతుందని చెబుతున్నారు. ఈ మూల్యాంకనం బుక్‌లెట్లను భద్రపర్చడం కూడా కష్టమంటున్నారు.



అసెస్మెంట్ బుక్ లెట్లు తీసుకువెళ్లటానికి ఇలాంటి ట్రాలీలు అవసరమంటూ ఉపాధ్యాయుల వాట్సాప్ గ్రూపుల్లో మీమ్స్ హల్‌చల్ చేస్తున్నాయి

అధిక భారం



విద్యార్థులు ప్రశ్నలకు సమాధానాలను రాసేందుకు అసెస్‌మెంట్ బుక్‌లెట్లను వినియోగిస్తున్నారు. ఇది ఉపాధ్యాయులకు భారంగా ఉంది. బోధనకు కూడా సమయం సరిపోవడం లేదు. పూర్వపు పద్ధతిలోనే పేపరుపై జవాబులు రాసే విధానాన్ని అమలు చేయాలి.

– పి.సురేంద్రకుమార్, జిల్లా అధ్యక్షుడు, యూటీఎఫ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

వ్యతిరేకిస్తున్నాం



ఉపాధ్యాయులకు పనిభారం పెంచేందుకే అన్నట్లుగా అసెస్‌మెంట్ బుక్‌లెట్లు ఉన్నాయి. పరీక్షా పత్రాలు కూడా విద్యార్థుల స్థాయికి మించి ఉన్నాయి. ఏ మాత్రం ఆమోదయోగ్యం కాని అసెస్‌మెంట్ బుక్‌లెట్ల విధానాన్ని వ్యతిరేకిస్తున్నాం. రాష్ట్ర స్థాయి అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్తాం.

– పోతంశెట్టి దొరబాబు, జిల్లా అధ్యక్షుడు, ఎస్‌టీయూ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

ఉపాధ్యాయులకే పరీక్ష



పరీక్షల విధానంలో కొత్తగా తీసుకుని వచ్చిన మూల్యాంకన విధానం ఉపాధ్యాయులకే పరీక్షలా ఉంది. ఉపాధ్యాయులపై తీవ్రమైన పనిభారం పడుతుంది. ఒక విధంగా చెప్పాలంటే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలే మేలు అన్నట్లుగా ఉంది. దీన్ని మా సంఘం తరఫున తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం.

– పి.నరేష్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఆపస్ ఉపాధ్యాయ సంఘం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

కొబ్బరి చెక్క.. సిరులు పక్కా

- రత్నగిరిపై వేలం పాట
- నెలకు రూ.19.05 లక్షలకు ఖరారు
- సత్యదేవునికి రికార్డు స్థాయిలో ఆదాయం



అన్నవరంలోని సత్యనారాయణస్వామి దేవస్థానం

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం సత్యనారాయణస్వామి దేవస్థానంలో కొబ్బరి ముక్కల వేలం రికార్డు ధరకు ఖరారైంది. గతంలో నెలకు రూ.7.26 లక్షలు ఉన్న వేలం ఈ సారి రూ.19.05 లక్షలు వెళ్లింది. అంటే దాదాపు మూడు రెట్లు పెరిగి సత్యదేవునికి సిరులు కురిపించింది. అన్నవరం దేవస్థానం చరిత్రలో ఒక వేలం ఇంత ఎక్కువ మొత్తానికి వెళ్లడం ఇదే ప్రథమం. రెండేళ్ల కాలపరిమితికి గాను గురువారం ఈ వేలం జరిగింది. దేవస్థానంలో వ్రతాలాచరించే భక్తుల నుంచి సేకరించే కొబ్బరి చెక్కలతో పాటు రావిచెట్టు వద్ద, వివిధ ఆలయాల్లో భక్తులు కొట్టే కొబ్బరి చెక్కలను పోగుచేసుకునేందుకు గతంలో విడివిడిగా వేలం నిర్వహించేవారు. అయితే దేవదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఆ రెండింటికీ కలిపి గురువారం ఒకే వేలం జరిపారు. ఈ కార్యక్రమంలో నలుగురు పాటదారులు పాల్గొన్నారు. గతంలో రెండు వేలం పాటల్లో నెలకు రూ.7.26 లక్షలు ఆదాయం వచ్చింది. గురువారం జరిగిన వేలంపాటలో రికార్డు స్థాయిలో రూ.19.05 లక్షలకు వెళ్లింది. దీంతో దేవస్థానానికి తొలి ఏడాది రూ.2.28 కోట్లు, రెండో ఏడాది పది శాతం పెరుగుదలతో సుమారు రూ. 2.51 కోట్లు ఆదాయం రానుంది. అంటే రెండేళ్లకు రూ.4.80 కోట్లు ఆదాయం సమకూరనుంది. అలాగే బుకింగ్ ఆఫీసు ఎదురుగా గల షాపింగ్ కాంప్లెక్స్‌లోని మూడో నంబర్ షాపులో కొబ్బరి కాయలు, అరటిపండ్లు విక్రయించేందుకు గాను గతంలో నెలకు రూ.2.33 లక్షలు ఉండగా ఇప్పుడు ఆ వేలం పాట నెలకు రూ.3.78 లక్షలకు వెళ్లింది. ప్రకాష్ సదన్ సత్రం వెనుక మినీ క్యాంటీన్ వేలం నెలకు రూ.2.82 లక్షలకు వేలం ఖరారైంది. దేవస్థానం ఈఈ నూకరత్నం, ఏఈఓ ఎల్ శ్రీనివాస్, సీ సెక్షన్ సూపరింటెండెంట్ వెంకట రమణ తదితరులు వేలం నిర్వహించారు.

విలువలతో కూడిన విద్యను అందించాలి

నల్లజర్ల: మైనార్టీ శాఖ ప్రభుత్వ సలహాదారుడు ఎంఏ షరీఫ్ గురువారం దూబచర్ల డైట్ (ఉపాధ్యాయశిక్షణ సంస్థ)ను సందర్శించారు. ఉర్దూ మీడియం ఉపాధ్యాయులతో మాట్లాడి స్థితిగతులను ప్రిన్సిపాల్ కమలకుమారితో చర్చించారు. సంబంధిత భాషా అధ్యాపకులు లేనందున విద్యార్థులు సైతం ఇక్కడకు రావడం లేదని, కళాశాల ఆక్రమణలకు గురైందని ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు. సమస్యలను పరిష్కరించడానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

రారా..కృష్ణయ్య

నల్లజర్ల: స్థానిక శ్రీ వేణుగోపాలస్వామి మందిరంలో శనివారం కృష్ణష్టామి సందర్భంగా వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ మద్దిపాటి చంద్రశేఖర్ గురువారం తెలిపారు. ఈ నెల 16న వేకువజామునే మేలుకొలుపు సేవ, వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, అష్టోతర సహస్రనామార్చనలు, భగవద్గీత పారాయణం, భజనలు నిర్వహిస్తారన్నారు. స్వామివారి ఉత్సవ మూర్తులతో పల్లకీసేవ, రాధాకృష్ణ వేషధారణలతో చిన్నారుల ప్రదర్శన, సాయంత్రం ఉట్టి ఉత్సవం, పవళింపు సేవ జరుగుతాయన్నారు. కావున పరిసర ప్రాంతాల చిన్నారులు, భక్తులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

బైక్ దొంగల అరెస్టు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మోటారు సైకిళ్లను దొంగిలిస్తున్న ముగ్గురిని త్రీటౌన్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్ ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన పోలీసులు బైక్ దొంగలను చాకచక్యంగా పట్టుకున్నారు. ఆ వివరాలను త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.రమేష్ బాబు వివరించారు. మోటారు సైకిళ్ల దొంగతనాలు ఎక్కువైన నేపథ్యంలో త్రీటౌన్ సీఐ వి.అప్పారావు నేతృత్వంలో దొంగలపై నిఘా పెట్టారు. దీనిలో భాగంగా కాతేరు గామన్ బ్రిడ్జి వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో ఉండ్రాజవరం మండలం సత్యవాడలోని రామాలయం వీధికి చెందిన కుప్పాల రంగారావు, పసలపూడికి చెందిన గోపిరెడ్డి యోహాన్, అరుంధతిపేటకు చెందిన సిర్రా బంగారు బాబు రాజమహేంద్రవరం వైపు నుంచి వెంకటనగరం వైపు వెళుతున్నారు. ఆ ముగ్గురిని పోలీసులు ఆపి వాహనాల రికార్డులను అడిగారు. వారి వద్ద ఎటువంటి రికార్డులు లేకపోవడంతో అను మానం వచ్చి విచారణ చేశారు. దీంతో వారు అపహరించిన మోటారు సైకిళ్ల వివరాలను తెలిపారు. వీరిపై త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌తో పాటు భీమవరం, గుడివాడ, ఏలూరు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. నిందితుల నుంచి 34 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. బైక్ దొంగలను పట్టుకున్న సీఐ వి.అప్పారావు, ఎస్సై అప్పలరాజు, హెడ్ కానిస్టేబుల్ వి.కృష్ణ, ఎన్.వెంకట రామయ్య, కె.సురేష్, చంద్రశేఖర్, విజయ్‌కుమార్, మహేష్ పవన్‌లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

ప్రాణం తీసిన చెట్టు

- ఉద్యోగానికి వెళుతుండగా కూలిన వృక్షం
- దుళ్ల యువకుడి మృతి



తొట్టా శ్రీనివాస్ (ఫైల్)

కడియం: చెట్టు కూలి మీద పడడంతో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించడానికి వెళుతున్న యువకుడు మృతి చెందాడు. పాయకరావుపేట మండలం రాంభద్రపురం – శ్రీరాంపురం మధ్య ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. కడియం మండలం దుళ్ల గ్రామానికి చెందిన తొట్టా శ్రీనివాస్ (31) అనకాపల్లి జిల్లా కేశవరం డెక్కన్ కెమికల్స్ ఫ్యాక్టరీలో ఉద్యోగం చేస్తున్నాడు. రోజూ మాదిరిగానే గురువారం తన క్వార్టర్స్ నుంచి స్నేహితుడితో కలిసి ఫ్యాక్టరీకి వెళుతున్నాడు. రాంభద్రపురం–శ్రీరాంపురం మధ్యకు వచ్చేసరికి ఓ భారీ వృక్షం కూలి వీరు వెళుతున్న మోటారు సైకిల్‌పై పడింది. దీంతో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందగా, స్నేహితుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. చెట్టు కింద ఉన్న శ్రీనివాస్ మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టానికి తరలించారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిదండ్రులకు ఒక్కడే సంతానం

శ్రీనివాస్‌కు రెండేళ్ల క్రితమే వివాహమైంది. పెళ్లయిన తర్వాత ఆరు నెలలకు అనకాపల్లి జిల్లా కేశవరంలోని డెక్కన్ ఫ్యాక్టరీలో ఉద్యోగం వచ్చింది. దీంతో తునిలోని బ్యాంక్ కాలనీలో భార్యతో సహ నివాసం ఉంటున్నాడు. శ్రీనివాస్ తల్లిదండ్రులకు ఒక్కడే కొడుకు. అతడి హఠాన్మరణంతో వారంతా తీవ్ర విషాదంలో కూరుకుపోయారు. కాగా.. దుళ్లలో మృతుడి కుటుంబాన్ని పలువురు పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

తప్పుచేసి ఎదురు దాడులు చేస్తారా..?



నల్లజర్లలో విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నల్లజర్ల: మాజీ హోంమంత్రి తానేటి వనితపై టీడీపీ యూత్ నాయకులు సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, పోస్టులు పెట్టడం తగదని వైఎస్సార్ సీపీ శ్రేణులు హెచ్చరించారు. మండల పార్టీ అధ్యక్షుడు వెల్లంకి వెంకటసుబ్రమణ్యం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. గోపాలపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ హోంమంత్రి తానేటి వనితపై నల్లజర్లకు చెందిన సవలం రామకృష్ణ, మద్దిపాటి మహేష్, దేవరపల్లి మండలానికి చెందిన నగ్గిన నాగేంద్రలు ఫేస్‌బుక్‌లో అనుచిత పోస్టులు పెట్టడం, ఏకవచనంతో సంబోదిస్తూ, వ్యంగంగా కించపరుస్తూ పోస్టులు పెట్టారన్నారు. వ్యక్తిగత దూషణలు, కక్షలకు పాల్పడం మీ పార్టీకే నష్టమన్నారు. మేం సంయమనం పాటిస్తుంటే తమది చేతగాని తనం అనుకోవద్దన్నారు. మా కార్యకర్తలు దేనికైనా సిద్ధంగానే ఉన్నారన్నారు. దూబచర్లలో కొబ్బరి బోండాల వ్యాపారి పెద్దిరాజు ఆత్మహత్యకు టీడీపీయే కారణమని, ఆత్మహత్యాయత్నం అనంతరం బాధితుడుని వనితతో పాటు తామంతా వెళ్లి వైద్యం జరుగుతున్న తీరును అడిగి తెలుసుకుని కుటుంబానికి ధైర్యం చెప్పామన్నారు. పెద్దిరాజు మృతి తర్వాత ఆ కుటుంబంపై టీడీపీకి ఎనలేని ప్రేమపెరిగిపోయిందన్నారు. మండలంలో గత, ప్రస్తుత ప్రభుత్వాల ఏడాది పాలనపై బహిరంగా చర్చిద్దాం రమ్మని కూటమి నాయకులకు సవాల్ చేశారు. అల్లూరి సూర్యచంద్రరావ, అప్పసాని నారాయుడు, సయ్యద్‌మునాఫ్, అందుగుల వెంకటేశ్వరావు, పిచ్చుకుల ప్రసాద్, ప్రత్తి మురళీ పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసే ర్యాగింగ్



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి, చిత్రంలో వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: విద్యార్థి దశలో జూనియర్లను ర్యాగింగ్ చేయడం ఆనందమని సీనియర్లు భావిస్తారని.. కానీ అది ఆ విద్యార్థి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బ తీస్తుందనే విషయాన్ని గ్రహించలేక పోతున్నారని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న యాంటీ ర్యాగింగ్ వీక్ కార్యక్రమంలో భాగంగా గురువారం జరిగిన అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తన జీవితంలో కూడా ర్యాగింగ్‌కు భయపడిన సంఘటనలు ఉన్నాయంటూ గుర్తు చేసుకున్నారు. ఎవరూ ర్యాగింగ్‌కు పాల్పడవద్దని, పాల్పడితే చట్టాల నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు. ప్రతి తల్లి, తండ్రి తమ పిల్లలను ర్యాగింగ్‌కు దూరంగా ఉంచాలని చూస్తారని, అందుకోసమే ర్యాగింగ్ ఛాయలు లేని కళాశాలలు, యూనివర్సిటీలను ఎంపిక చేసుకుంటున్నారన్నారు. ర్యాగింగ్ వలన జీవితాలు నాశనం అవడమే కాకుండా కన్నవారికి, చదువుకునే సంస్థలకు కూడా చెడ్డ పేరు వస్తుందన్నారు. వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ మాట్లాడుతూ 'నన్నయ' వర్సిటీ అంటేనే సత్ప్రవర్తనకు కేరాఫ్ అనే ఖ్యాతిని పొందేలా మీ నడవడిక ఉండాలని విద్యార్థులకు హితవు పలికారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీకి యత్నం

నిడదవోలు రూరల్: మండలంలోని తాడిమళ్ల ప్రధాన సెంటర్‌లో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం చోరీకి విఫలయత్నం జరిగింది. స్థానిక ఎస్‌బీఐ బ్రాంచ్ పక్కన ఉన్న ఈ ఏటీఎంలో బుధవారం అర్ధరాత్రి తర్వాత ఈ సంఘటన జరిగింది. ఈ మేరకు గురువారం బ్యాంకు మేనేజర్ రవి అందించిన సమాచారంతో సమిశ్రగూడెం ఎస్సై ఎల్.బాలాజీ సుందరరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఏటీఎంలోకి ప్రవేశించిన దొంగలు ముందుగా సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. డబ్బులను చోరీ చేసేందుకు ఏటీఎం ముందు భాగాన్ని పగులగొట్టారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఆన్‌లైన్‌లో రూ.1.53 కోట్లకు టోకరా

రాజమహేంద్రవరం రూరల్: గుర్తుతెలియని వ్యక్తి సెల్‌ఫోన్‌కు మేసేజ్ పంపి, క్యాపిటల్ సర్వీసెస్ గ్రూప్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నానని నమ్మించి ఖాతా తెరిపించి రూ.1.53 కోట్లకు టోకరా వేసిన ఘటన రాజమహేంద్రవరంలో చోటు చేసుకుంది. బొమ్మూరు పోలీసుల కథనం ప్రకారం రాజమహేంద్రవరం వీఎల్‌పురం సత్యనారాయణపురం వీధికి చెందిన విశ్రాంత హార్లిక్స్ ఫ్యాక్టరీ మెడికల్ ఆఫీసర్ ఏలూరిపాటి శ్రీరామసూర్యప్రసాద్‌కు గుర్తుతెలియని వ్యక్తి నుంచి వాట్సాప్ మేసేజ్ వచ్చింది. ఏఏ413 ఐఐఎఫ్‌ఎల్ క్యాపిటల్ సర్వీసెస్ అండ్ గ్రూప్ నుంచి ప్రాతినిధ్యం వహించినట్లు నమ్మించాడు. సదరు గుర్తుతెలియని వ్యక్తి శ్రీరామసూర్యప్రసాద్‌ను ఖాతా తెరవమని బలవంతం చేసి, ఖాతా తెరిపించి ఆయనకు రూ.5,000 పంపాడు. ఆ వ్యక్తి తప్పుడు యాప్‌ను ఉపయోగించి 'కష్టపడండి ఫలితం పొందండి' అంటూ ప్రత్యక్షంగా పెట్టుబడులు పెడితే మంచిలాభాలు ఉంటాయని నమ్మించడంతో శ్రీరామసూర్యప్రసాద్ ఈ నెల 5వ తేదీ నుంచి ఈ నెల 11వ తేదీ వరకు దఫదఫాలుగా వివిధ బ్యాంకు ఖాతాల నుంచి రూ.1,53,48,000 పోగొట్టుకున్నారు. అవతలి వ్యక్తుల నుంచి ఎటువంటి సమాధానం రాకపోవడంతో శ్రీరామసూర్యప్రసాద్ సైబర్‌క్రైమ్‌లో రిఫరన్స్ నంబర్ ద్వారా గురువారం సాయంత్రం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇన్‌స్పెక్టర్ పి.కాశివిశ్వనాథం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మా పొట్ట కొట్టొద్దు

పెరవలి: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో తీవ్రంగా నష్టపోతామని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని ఆటో డ్రైవర్లు కోరారు. గురువారం మండల కేంద్రం పెరవలిలో ఆటో డ్రైవర్లు ధర్నా నిర్వహించారు. మీకు ఓట్లు వేసి గెలిపించినందుకు బహుమతిగా మా పొట్టలు కొడుతున్నారు అంటూ ఆటో డ్రైవర్లు మండిపడ్డారు. సూపర్ సిక్స్‌లో భాగంగా ఉచిత బస్సు పథకాన్ని ఈ నెల 15 నుంచి ప్రారంభిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో ఆందోళన చెందుతున్నారు. ఎన్నో ఏళ్లుగా ఈ వృత్తినే ఆధారంగా చేసుకుని కుటుంబాలను పోషించుకుంటున్నామని, ఉచిత బస్సుతో తమ బ్రతుకులు వీధిన పడతాయని వాపోతున్నారు. ప్రభుత్వాలు ఉపాధి కల్పించాలి కానీ ఉన్న ఉపాధిని కోల్పోయేలా చేయడం అన్యాయమని ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. అన్నవరప్పాడు, పెరవలి, ముక్కామల, ఖండవల్లి, కానూరు, కాకరపర్రు యూనియన్ల సభ్యులు పాల్గొన్నారు.


పెరవలిలో ధర్నా చేస్తున్న ఆటో డ్రైవర్లు

పొగాకు బోర్డు, గుంటూరు

వాణిజ్య మరియు పరిశ్రమల మంత్రిత్వ శాఖ, వాణిజ్య విభాగము, భారత ప్రభుత్వము
(ఐ.యస్.ఓ.9001:2015 గుర్తింపు పొందిన సంస్థ)
జి.టి. రోడ్డు, గుంటూరు-522 004. ఫోన్స్: 0863-2358399, 2358499

FCV పొగాకు నారుమళ్ళ పెంపకం- నియంత్రణ

పొగాకు బోర్డు FCV పొగాకుకు దేశీయంగా మరియు విదేశాలలో గల గిరాకీని మరియు మార్కెట్‌లో ప్రస్తుతం ఉన్న నిల్వలను దృష్టిలో పెట్టుకుని, ఆంధ్రప్రదేశ్‌లో 2025-26 పంట కాలమునకు 142 మిలియన్ కేజీల ఉత్పత్తికి అనుమతించబడినది. గత సంవత్సరంలో అధిక పరిమాణంలో పండించిన పంట వలన రైతులు వేలం కేంద్రాలలో పొగాకు అమ్ముకొనుటకు ఎదుర్కొనుచున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని, ఈ సంవత్సరం రైతులు పొగాకు బోర్డు నిర్ణయించిన పంట పరిమితిలోనే పొగాకు పండించవలసిన ఆవశ్యకత ఉంది.

ఇందుమూలముగా పొగాకు పంట నియంత్రణలో భాగంగా నర్సరీ దశ నుండి అన్ని నియమ నిబంధనలు అమలు పరచడానికి పొగాకు బోర్డు అవసరమైన అన్ని చర్యలు చేపడుతుంది. పొగాకు బోర్డు చట్టం, 1975 లోని సెక్షన్ 10-ఎ(1) ప్రకారం వాణిజ్య సరళిలో పొగాకు నారుమడి సాగు చేయు రైతులు నారుమడి పెంపకానికి తప్పనిసరిగా వారి పరిధిలోని పొగాకు బోర్డు కార్యాలయము నుండి రిజిస్ట్రేషన్ పొందాలి. గరిష్టంగా ప్రతి రైతు రెండు హెక్టార్ల విస్తీర్ణం వరకూ రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు. వాణిజ్య సరళిలో పొగాకు నారుమడి పెంపకానికి రిజిస్ట్రేషన్ పొందిన రైతులకు మాత్రమే NIRCA (CTRI) సంస్థ వారు విత్తన సరఫరా (3.5 కేజీ/హెక్టారు) చేయడం జరుగుతుంది. నారుమడికి అనువైన నేలలో మరియు అనువైన నీటి వనరులు గల ప్రదేశాలలో మాత్రమే నారుమడుల పెంపకం చేపట్టవలెను. పొగాకు బోర్డు చట్టం, 1975 లోని సెక్షన్ 10-ఎ(2) ప్రకారం, నారును రిజిస్టర్ రైతులకు కాకుండా వేరే ఏ వ్యక్తికి విక్రయించకూడదు. నారుమడుల రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి పొగాకు బోర్డు నారు అమ్మకాలకు సంబంధించిన రసీదు పుస్తకాలు సరఫరా చేయడం జరుగుతుంది. నారుమడులను ప్రత్యేక అధికారుల బృందం తనిఖీ చేస్తుంది మరియు బోర్డు రిజిస్ట్రేషన్ లేకుండా నర్సరీలు సాగు చేసే వారిపై బోర్డు తగిన చర్యలు చేపడుతుంది. నారుమడులను రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతుల జాబితాను పొగాకు బోర్డు, పొగాకు సాగుదారులకు తెలియజేయబడుతుంది. పొగాకు సాగు చేసే రైతులు విధిగా రిజిస్ట్రేషన్ ఉన్న నర్సరీల నుంచి మాత్రమే నారు కొనుగోలు చేసి, పొగాకు నాట్ల సమయంలో బోర్డు అందిస్తున్న ఫారం-2 (మొక్క ఫారం) తో పాటు నారు అమ్మిన నర్సరీ యజమాని ఇచ్చిన రసీదును జత చేసి, సంబంధిత అధికారులకు అందచేయాలి. రిజిస్ట్రేషన్ లేని నర్సరీల నుంచి నారు కొనుగోలు చేసి, పొగాకు సాగు చేస్తే వారి రిజిస్ట్రేషన్ నిలుపుదల చేయబడును.

రిజిస్టర్ చేయబడిన నారుమడులు పొగాకు బోర్డు మరియు NIRCA (CTRI) సాంకేతిక బృందం నిత్యం పర్యవేక్షించి, ఉత్తమ యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించి రైతులకు మేలైన ఆరోగ్యకరమైన పొగాకు నారును పెంచేందుకు సహాయ సహకారాలను అందించబడుతుంది.

కావున FCV పొగాకు నారుమళ్ళ పెంపకందారులందరూ తప్పనిసరిగా పొగాకు బోర్డు నుండి రిజిస్ట్రేషన్ పొందిన తరువాత మాత్రమే నారుమళ్ళపెంపకం చేపట్టవలెను, లేనియెడల పొగాకు బోర్డు చట్టం ప్రకారం తగు చర్యలు తీసుకొనబడునని తెలియపరచడమైనది.

సెక్రటరీ, పొగాకు బోర్డు

మాజీ సీఎం జగన్ సమక్షంలో జన్మదిన వేడుకలు


బెంగుళూర్‌లో తోట రామకృష్ణకు కేక్ తిని పిస్తున్న మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి

తాళ్లపూడి: మండలం పెద్దేవంకు చెందిన వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ మాజీ అధ్యక్షుడు, సీనియర్ నాయకులు తోట రామకృష్ణ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్ రెడ్డి సమక్షంలో పుట్టిన రోజు వేడుకలను గురువారం నిర్వహించారు. ఈ మేరకు బెంగళూరులోని జకూర్ ఏరోడ్రం వద్ద గురువారం వైయస్ జగన్‌మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి జగన్‌మోహన్ రెడ్డి సమక్షంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జగన్ ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపి, స్వయంగా కేక్ తినిపించారు. అనంతరం తోట మాట్లాడుతూ జన్మదిన వేడుకలను జగనన్న సమక్షంలో జరుపుకోవడం తన జీవితంలో ఓ మధురమైన ఘట్టమని, ఓ పార్టీ అధినేత సామాన్య నాయకుడికి ఇచ్చిన అరుదైన గౌరవమన్నారు.

విస్తారంగా వర్షాలు


అన్నవరప్పాడులో నీటమునిగిన అరటితోట


ఖండవల్లిలో దొండ పందిరి

- స్తంభించిన జనజీవనం
- మూడూ గంటలు ఏకధాటి వర్షం
- నీటమునిగిన పంటలు


తీపర్రులో కందచేను

పెరవలి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా విస్తరంగా వర్షాలు కురిస్తున్నాయి. ఈ మేరకు మండలంలో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి జనజీవనం స్తంభించిపోయింది. పల్లపు ప్రాంతాలు జలమయమవ్వగా, పంట పొలాలు నీటమునగడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఆకాశానికి చిల్లు పండిందా అన్నట్లు మూడు గంటల పాటు కురిసిన కుంభవృష్టితో రోడ్లు కాలువల్లా దర్శనమిచ్చాయి. విద్యార్థులను వివిధ పాఠశాల యాజమాన్యాలు రాత్రి 8 గంటల తరువాత ఇండ్లకు పంపించారు. రానున్న మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతవరణశాఖ అధికారులు హెచ్చరించారు. మండలంలో ప్రస్తుతానికి ఆస్తి నష్టం సంభవించలేదని రెవెన్యూ అధికారులు తెలిపారు.

వర్షపు నీటితో ఇబ్బందులు

తాళ్లపూడి: తాళ్లపూడి మండలంలో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. భారీ వర్షంతో మండలంలో పలుగ్రామాల్లోని రోడ్లు, పల్లపు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. తాళ్లపూడిలోని మెయిన్ రోడ్డు, ఎస్సీ ఏరియాలో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

రైతన్నలు ఆందోళన చెందొద్దు


కంసాలిపాలెంలో రైతులకు సూచనలిస్తున్న ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్

నిడదవోలు రూరల్: మండల వ్యాప్తంగా గత రెండు రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులెవరూ ఆందోళన చెందొద్దని జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు సూచించారు. రావిమెట్ల, శంకరాపురం, కంసాలిపాలెంలో గురువారం వరి పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచలిచ్చారు. వర్షాలతో ఆకుముడత పురుగులు నివారించబడతాయన్నారు. పిలకల దశలో వరిపంట మునిగితే నీరు బయటకు పోయిన తరువాత ఎకరానికి 20 కేజీల యూరియా, 20 కేజీల ఫొటాష్ అదనంగా కలిపి పిచికారి చేయాలన్నారు. ఎండు తెగులు, పాడ తెగులు, ఆకుముడత నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ, అగ్రికల్చరల్ అసిస్టెంట్‌లు, రైతులు పాల్గొన్నారు.

వంతెనపై నీటి ఇక్కట్లు


దేవరపల్లి పోలవరం కుడి కాలువ వంతెనపై నిలిచిన వర్షం నీరు

దేవరపలి: మండల పరిధిలోని గుండుగొలను-కొవ్వూరు ప్రధాన రహదారిలో అయ్యస్వామి ఆలయం వద్ద పోలవరం కుడికాలువపై గల వంతెనపై బుధవారం కురిసిన వర్షానికి నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. వంతెనకు ఇరువైపులా ఉన్న రంధ్రాలు మట్టితో పూడికుపోవడంతో నీరు బయటకు వెళ్లే మార్గాలు లేక వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భూ వివాదాల పరిష్కారానికే పీఓఎల్‌ఆర్

నిడదవోలు: ఖచ్చితమైన, నవీకరించబడిన భూమి రికార్డులతో భూ యజమాన్యులు, ప్రభుత్వం మధ్య వివాదాలను పీఓఎల్‌ఆర్ తగ్గిస్తాయని తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ అన్నారు. ఉండ్రాజవరం మండలం తాడిపర్రు పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం భూ రీ సర్వేలో భాగంగా రైతులతో సమావేశం నిర్వహించారు. మొదటి దశలో తాడిపర్రు గ్రామానికి ఎనిమిది గ్రామాలతో ఉన్న సరిహద్దులను మార్క్ చేసినట్లు తెలిపారు. రెండో దశలో ప్రభుత్వ భూములు చెరువులు, కుంటలు, స్మశానాలు, గ్రామ కంఠం హద్దులు గుర్తిస్తామని, అనంతరం ప్రైవేట్ భూములు సర్వే చేపడతామన్నారు. రికార్డుల్లో చనిపోయిన వ్యక్తి పేరున ఉన్న భూ రికార్డులు గుర్తించి వారి కుటుంబ సభ్యులకు నోటీసులు అందచేసినట్లు పేర్కొన్నారు. ఆ భూములను వారసులకు బదలాయించడంతో ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కరుటూరి నరేంద్ర, మండల సర్వేయర్ జి.శ్రీనివాసరావు, రీ సర్వే డిటీ ఎమ్. హరిప్రసాద్, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

గణపతి ఉత్సవాలకు రాట ముహూర్తం

నిడదవోలు: పట్టణంలోని గణేష్ చౌక్ సెంటర్‌లో వేంచేసియున్న పూజా గణపతి కుమారస్వామి వార్ల ఆలయం వద్ద నిర్వహించే గణపతి నవరాత్ర మహోత్సవాలకు శుక్రవారం ఉదయం 9:35 గంటలకు రాట ముహూర్తం చేస్తారని ఆలయ కమిటీ అధ్యక్షుడు కారింకి సాయిబాబు గురువారం తెలిపారు. రాట ముహూర్తానికి మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, నిడదవోలు సీఐ పీవీజీ తిలక్, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కామిశెట్టి సత్యనారాయణ హాజరు కానున్నారని ఆలయ కమిటీ అధ్యక్షుడు కారింకి సాయిబాబు పేర్కొన్నారు.